క్లుప్తంగా

కాలానికి అనుగుణంగా పరిశోధనలు

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్: ప్రస్తుత ప్రపంచంలో ప్రజలకు ఉపయోగపడేవిధంగా, కాలానికి అనుగుణంగా పరిశోధనలు చేయాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో 'న్యూ క్యాటలిటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్ సెలెక్టివ్ పీ–సీ అండ్ సీ ఎటిరో అటామ్ బాండ్ ఫార్మేషన్ ఇన్ కెమికల్ సిందాసిస్' అనే అంశంపై ప్రొఫెసర్ సి నర్సింహ్మస్వామి పర్యవేక్షణలో మహ్మద్ ముఖీద్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు మహ్మద్ ముఖీద్‌ను అభినందించి డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రీసెర్చ్ డీన్ ఆచార్య కిష్టఫర్, డీన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ డీన్ రాజు, పబ్లిక్ రిలేషన్ గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

కడ్తాల్: అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని మైసిగండిలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని నిర్మాణ దారుడికి సూచించారు. అభివృద్ధిలో మండలాన్ని మొదటిస్థానంలో నిలపడమే లక్ష్యమని, అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం, నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజ చేస్తున్న అర్చకులు, గిరిజన గురువులు

కడ్తాల్: మండల పరిధిలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీలో నేనావత్ శివనాయక్ ఆధ్వర్యంలో ఎత్తం రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాత నేనావత్ శివనాయక్‌ను గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం పెంపొందుతుందని గిరిజన గురువులు అన్నారు. కార్యక్రమంలో గిరిజన గురువులు బీచ్యాబావోజీ, రాజుబావోజీ, కిరణ్‌బావోజీ, నాయకులు రవికుమార్, బీచ్యా, సక్రు,రాజు, జైపాల్, కృష్ణ, పాండు, రఘు, నరేశ్ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

యాచారం: మండలంలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోదాదేవి పద్మావతి, వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉ.8 గంటల నుంచి నాదస్వర సుప్రభాతం, పంచామృత అభిషేకం, సహస్ర నామవళి పూజ, మంగళహారతి, మంత్ర పుష్పం పూజలు చేశారు. అనంతరం దేవతా మూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవం నిర్వహించారు. గోవిందా నామస్మరణలతో దేవాలయ ఆవరణ మార్మోగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

ఇబ్రహీంపట్నం: గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ కృపేష్‌లు పేర్కొన్నారు. మండలం పరిధిలోని కప్పపహాడ్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలంతా కలిసి కట్టుగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భరత్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఇంద్రాసేనారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హంసమ్మ, మాజీ ఉప సర్పంచ్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ఏర్పాటయ్యేనా?

- ఏళ్లుగా నెరవేరని హామీ
- భారంగా మారిన ఉన్నత చదువులు
- కళాశాల పనులు ప్రారంభించాలని వేడుకోలు



అజీజ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు, ఉన్నత విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు హామీలు ఇచ్చింది. కానీ మొయినాబాద్ మండలంలో నేటికి ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కాలేదు. ప్రజాప్రతినిధుల హామీలు నేటికి నెరవేరలేదు. వారి మాటలు నీటి మూటలుగా మారాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మండలంలో 14 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం దాదాపు 1200నుంచి 1500వరకు విద్యార్థులు పదోతరగతి పాసవుతున్నారు. ఈ క్రమంలో పేద విద్యార్థులకు ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతోనే అయిష్టంగానే పేద విద్యార్థులు ప్రయివేటు కళాశాలలకు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు.

నెరవేరని హామీ..

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తామనే ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీలు పట్టించుకునే వారే లేరు. మళ్లి ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం వచ్చిన కూడా కళాశాల ఏర్పాటునకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏర్పాటు చేయాలి



రాష్ట్రంలో మండలానికో జూనియర్ కళాశాల ఏర్పాటు విషయం మొయినాబాద్ మండలంలో కలగానే మిగిలింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళాశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.

– శరణ్యశ్రీ, పదోతరగతి, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్

కలగానే మిగిలింది



మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం ఈ ప్రభుత్వమైనా కృషి చేయాలి. మొయినాబాద్ మండలంలో కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. పదోతరగతి పూర్తయిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం నగరంతో పాటు ఇతర మండలాలకు వెళ్తున్నారు.

– మంజుల, సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్

దాతల సహకారం మరువలేనిది

ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్



దాతను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కేశంపేట: గ్రామాల అభివృద్ధిలో స్వచ్ఛందసంస్థలు, దాతల సహకారం మరువలేనిదని కొత్తపేట ఎంపీటీసీ పసుల మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సహాయంతో ఎన్‌టీటీ సహకారంతో గ్రామంలో రూ. 12లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రంలో ఫర్నీచర్‌తో పాటు మరమ్మతు పనులు నిర్వహించారు. గ్రామస్తులకు 2వేల లీటర్ల సామర్థ్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించి, గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 500మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, మండల విద్యాధికారి మనోహర్‌లు పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చి గ్రామాలను అభివృద్ధి చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మాజీ సర్పంచ్ కమ్లెకర్ నవీన్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎన్‌టీటీ సంస్థ సీనియర్ డైరెక్టర్లు గజేంద్ర, ప్రతాప్, సోమేశ్, ప్రసాద్, నిర్మాణ్‌సంస్థ సీఈవో అనురాధ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు



మాట్లాడుతున్న భానుప్రకాశ్

బాలల పరిరక్షణ విభాగం అధికారి భానుప్రకాశ్

కొందుర్గు: బాల, బాలికలకు వివాహ వయస్సు రాకముందే పెళ్లిల్లు చేస్తే చట్ట ప్రకారం వారు శిక్షార్హులు అవుతారని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం కొందుర్గు కేజీబీవీలో బాలల, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను అక్రమ దత్తత తీసుకోవడం, అక్రమ రవాణ చేయడం, మైనర్లను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాలప్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, కేజీబీవీ ప్రత్యేకాధికారి శకీనా నిస్సీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



చేవెళ్ల: మహాపడి పూజలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని న్యాలట గ్రామంలో గురువారం శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు దైవభక్తి దోహదం చేస్తోందని చెప్పారు. అందుకే భక్తులు మాలధరించి భక్తిభావంతో పూజలు చేస్తారన్నారు. అనంతరం మండలంలోని పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పి ప్రభాకర్, సత్తయ్య, రాములు, ఎల్లేశ్, గురుస్వామి సురేశ్, శివమాలధరించిన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొందుర్గు: పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గులో..

కొందుర్గు: మండలంలోని ముట్పూర్‌లో గురువారం శివనామస్మరణతో మార్మోగింది. హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

తలకొండపల్లి: కల్వకుర్తి పట్టణంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిలుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లురవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ్మారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ హాజరవుతున్నారని మోహన్‌రెడ్డి చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అందరు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గుల: మండలం పరిధిలోని ఇర్విన్ గ్రామంలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా సూదిని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామానికి రూ.20 లక్షలు సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు అయినట్లు చెప్పారు. అలాగే, ఇర్విన్ గ్రామ పరిధిలోని రెడ్డిపురం గ్రామానికి రూ.5 లక్షలు, దిల్‌వర్ ఖాన్‌పల్లి, గ్రామానికి రూ. 5లక్షలు మంజూరు అయ్యాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నాయకులు చంద్రయ్య, శివగౌడ్, శ్రీశైలం, పర్వతాలు, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా మాతాపితరుల దినోత్సవం



తల్లిదండ్రులకు పూజలు చేస్తున్న చిన్నారులు

షాద్‌నగర్: సంత శ్రీ ఆసారాం బాపూజీ ఆశ్రమం, శ్రీ యోగా వేదాంత సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రాఘవేంద్ర కాలనీలోని రంగరాయ ఆడిటోరియంలో మాతృ, పితృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ అమర్‌నాథ్, శరత్‌లు మాట్లాడారు. ప్రతి ఇల్లు దేవాలయం లాంటిదని, తల్లిదండ్రులు దైవ సమానులని, వారిని గౌరవించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. నేటి సమాజంలో పాశ్చాత్య పోకడలు అధికమయ్యాయని, సంస్కృతి, సాంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. పిల్లలు పెద్దయ్యాక జన్మనిచ్చిన తల్లిదండ్రులకు దూరంగా ఉంటుంన్నారన్నారు. దీంతో వారు అనాథ ఆశ్రమాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తల్లిదండ్రులను పూజిస్తే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రవిప్రకాశ్ హర్మాశ్, పరమేశ్వర్, నవీన్, దేవీసింగ్, పవన్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తన కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీలో నిలబడితే ప్రజలందరూ తనను ఎంతో ఆదరించారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై అందరు దృష్టి సారించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగితే ఎన్నికల్లో విజయం సాధించడం సులభమన్నారు. ఈ సమావేశంలో విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, శివారెడ్డి, మాణిక్యం, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, బోయ అశోక్, రాజు, శ్యాంసుందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కృషి

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మన్నే వెంకటేశ్



నియామకపత్రం అందిస్తున్న అధ్యక్షుడు మన్నే వెంకటేశ్

చేవెళ్ల: జిల్లాలోని ముదిరాజ్‌ల ఉపాధికి ఉపయోగపడే చెరువుల పరిరక్షణకు ఫిషరీస్ సొసైటీ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు మన్నే వెంకటేశ్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఫిషరీస్ సొసైటీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నూతన అధ్యక్షుడిగా తెలుగు వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. అనంతరం మన్నే వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ఫిషరీస్ సొసైటీలపై ఉందన్నారు. అనంతరం నూతన నూతన అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఫిషరీస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ అధ్యక్షుడు తెలుగు రాఘవేందర్, సొసైటీ సభ్యులు మాణిక్యం, శ్రీనివాస్, లింగం, మాసయ్య, వెంకటయ్య, పోచయ్య, ఆనంద్, జనార్దన్, రాజశేఖర్, రాజేశ్, అంజయ్య, గణేశ్, రాజు, బద్రి, శ్రీకాంత్, రమేశ్, వెంకటేశ్, రమేశ్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్, నవాబ్‌పేట మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నేటి పొదుపు.. రేపటికి మదుపు

కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్



మాట్లాడుతున్న నర్ర సంతోష్‌రెడ్డి

షాద్‌నగర్ : నేడు మనం చేసుకునే పొదుపు రేపటి జీవితానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని కరూర్ వైశ్యాబ్యాంక్ షాద్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ నర్ర సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కరూర్ వైశ్యా బ్యాంక్‌లో మేనేజర్ నర్ర సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ శాఖ రెండో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నర్ర సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఖాతాదారుల ఆర్థికాభివృద్ధికి కరూర్‌వైశ్యా బ్యాంక్ ఎంతో కృషి చేస్తుందన్నారు. తక్కువ వడ్డీరేట్లకే రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. పట్టణంలో కరూర్‌వైశ్యా బ్యాంక్ ఉత్తమ సేవలను అందిస్తూ ఖాతాదారుల మన్ననలను పొందుతుందన్నారు. వాహనాల రుణాలు, వ్యాపార, గృహ, మార్ట్‌గేజ్, బంగారంపై రుణాలు ఇస్తున్నామన్నారు. కరూర్ వైశ్యా బ్యాంక్ షాద్‌నగర్ శాఖలో ఖాతాదారులకు లాకర్ సదుపాయం కూడా ఉందని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో 98 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ రూ.98.11లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ని మహిళలు ఆదరించడంతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేశారన్నారు. వారం రోజుల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం అందజేయనుందని పేర్కొన్నారు. రూ.10లక్షల ఆరోగ్య బీమా కలిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీలు భార్గవ్ కుమార్‌రెడ్డి, కావలి శ్రీశైలం, కౌన్సిలర్లు ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, బాబర్‌ఖాన్, శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, అందెమోహన్, ఖదీర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు ఆర్థిక సాయం..

మండల పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.2లక్షల చెక్కును అందజేశారు. గురువారం అనాథ, వృద్ధాశ్రమంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మంది వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అనాథలు, వృద్ధులకు ఎఫ్‌సీఎన్ సంస్థ అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గీతా థామస్ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిగిద్దలో సీసీ రోడ్డు..

మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.



వృద్ధులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే